# రాగరేఖలు

పన్నెండేళ్ళూ వెళ్ళి పదమూడో ఏడు వస్తుంది. ఆవేళే పుట్టిన రోజు. వరహాల్ని తెల్ల తెల్లవారగట్లే లేపి తలంటిపోసింది వాళ్ళమ్మ.

తలంటిన దగ్గరనుంచీ రవణమ్మకి "ఈ ఏడు కూతురికి పెళ్ళి చేయాలి" అని ఒక్కటే ఆలోచన పట్టుకుంది. వరహాలు జబ్బసత్తువ వున్న పిల్ల. కనుకనే వయస్సుకన్నా ముందు శరీరం నునుపుదేరింది. పొడుగు ఎదక్క పోయినా, కాస్త నిండుగా, బొద్దుగా, ఎక్కడవుండే అంగసౌష్టవం అక్కడ ... చక్కగా పెరిగింది వరహాలు. వంట వండుతున్నంతసేపూ రవణమ్మ పిల్ల పెండ్లి గురించే ఆలోచిస్తోంది.

"అబ్బ! ఆయన మనీని. ఎక్కడి జాప్యం దాపురించి దబ్బా" అంటూ కొంచెం తీవ్రంగానే ఆలోచించనారంభించింది ఆలోచనల తీవ్రతలో అప్పుడే రెండు బొబ్బట్లు కూడా మాడ్చె సింది. అవును మరి—ఈవేళా నిన్నటిదీనా; ఈవిషయం రెండేళ్ళ నుంచీ తాను వెంకన్న పంతులు గారితో చెపుతూనే వుంది.

"ఒక్కగానొక్క అమ్మాయి...దీనికేనా ఈడేరకుండా పెళ్ళి చేయవద్దుటండీ!" అంటూ ఎన్ని సార్లు చెప్పిందని—

"ఒసే...తలుపు తీ"...అంటూ కేక వినపడింది.

"అమ్మాయీ...నాన్నొచ్చారు తలుపు తియ్యే" ... అని వంటింటిలోంచే కేక పెట్టింది రవణమ్మ. రమణమ్మ గొంతు విన్నవాళ్ళు, అచ్చం నెమలి కంఠమే అనటం కద్దు. కాని అమ్మాయి పెళ్ళి ఆలోచనల బరువుతో గడ్డకట్టి బొంగురు పోయింది.

"పంజాబ్ సింధు గుజరాత్ మరాఠా ... ద్రావిడ వుత్కలవంగా"... అని పాడుతున్న వరహాలు, తటిక్కున లేచి కుట్టుతున్న సూది, జేబురుమాలూ — చేతిలోనే వుండగా పాట కూడా మానకుండానే వీధి తలుపు దగ్గరకు పరుగెట్టింది. నిజానికి వరహాలు పరుగెడుతున్నప్పటి కంటె, నడుస్తున్నప్పుడే ఎక్కువ హుందాగా వుంటుంది. నాజూకుగా భుజాలు కదలటం అదీ ఎంత చక్కగా వుంటుందని! తలుపు తీసింది. తీస్తూనే 'నాన్నా' అంది ముద్దుగా.

"ఏంమ్మా వరాలూ—" అంటూ వెంకన్న పంతులు అమ్మాయిని పైకెత్తేడు. ఒక్కమారుగా చేతిమీద వేసుకొని లోపలికి తీసుకువచ్చాడు. తిన్నగా వాళ్ళమ్మ వద్దకే తీసుకువెళ్ళాడు. "ఏవే! మాఅమ్మకి ఏం తెమ్మన్నావేఁ?" అన్నాడు చిన్నప్పటి పైలాపచ్చీసువల్ల కాస్త లొంగిపోకపోతే, అసలు వెంకన్న పంతులుఁది ఏనుగు బలమే !!— అతని గంభీర కంఠంలో కొండవాగులు సుళ్ళు తిరుగుతాయి! తన పాతికేళ్ళ సర్వీసు ఆ పల్లెటూగుబడికే దానం చేయడంవల్ల, ఆట్టే అంత తాకళ్యం అబ్బలేదతనికి.

అరటాకులో బొబ్బట్లవుండ పల్చగా పరుస్తూ భర్తకేసి కొరగా చూసింది రమణమ్మ! "అమ్మాయికి ఏం తెస్తాగు మొగుణ్ణితెండి త్వరగా! ..." అంది. తన మనస్సులోని బాధంతా వెడల్కగక్కేసింది రమణమ్మ.

"యిదిగో—యీబట్టలు చూడు అన్నాడు వెంకన్న పంతులు. తన భార్య ప్రస్తావించిన విషయాన్ని విన్నట్టేలేదు. చేతి సంచీలోవున్న బట్టల పేకట్టు విప్పుతున్నాడు. "ఇదుగో—యీ చీర నీకు... బాగుందా? నా కివి ... మా బంగారు తల్లికివీ" అన్నాడు గబగబా. నవ్వుతూ ముందర పళ్ళుపైకెత్తి కత్తిరించిన మీసాలు ముక్కుకు తగిలించాడు. అందుచేత నే

శాబోలు అదో విధముగా చూచాడు.

పొయ్యిపోగకి రమణమ్మ కళ్ళనుండి నీళ్ళువస్తున్నాయి కళ్ళు తుడుచుకొంటూ పెదవిమీద చిరునవ్వు చిందులాడిస్తూ 'మనకెందుకండీ, యీ బట్టలు! మీకు మరీ చిన్నతనం వస్తోంది' అంది. వెంకన్న పంతులేమీ జవాబు చెప్పలేదు. అదేదో శృంగారంగా నవ్వేడు. అతనికి రమణమ్మంటే చెప్ప లేనంత గానాం, ముద్దున్నూ. తాను ఏభయ్యో పడిలో ప్రవేశిస్తున్నాడా, అయినా ఇంకా ఆమెతో సరసాలాడుతూ, అప్పుడప్పుడూ చీవాట్లు తింటూనే వుంటాడు.

వరహాలు తన బట్టలపేకట్టు విప్పి చూచుకొంటోంది. పరికిణీ తీసి భుజంమీద వేసుకుంది. జాకెట్టు చేతులు ఎలా కుట్టాడోనని పరిశీలిస్తోంది. రమణమ్మ వరహాల్ని చూస్తూ— "యివేమండీ— వోణీలు తేలేదేం? అమ్మాయికీవేళ పమిటె వేయించాలి" అంది. ఆమాట లతనికి భీకరంగా వినిపించాయి.

"అదేమిటే అలా అంటావు? మా అమ్మకి అప్పుడే పవిటెందుకే— నీ మొహంలా వుంది" అంటూ గొణిగాడు వెంకన్న పంతులు. కూతురంటే అతనికి వెఱ్ఱి ఆపేక్ష. అతని కళ్ళకి వరహాలు ఎదుగుతున్నట్టే కనిపించలేదు. నిన్నగాక మొన్ననే కదా పుట్టిందని ఆ వెఱ్ఱిబ్రాహ్మడి వుద్దేశ్యం.

"చాల్లెండి. ఏళ్ళు ఎగసన్నమవుతుంటే బుద్ధి దిగసన్నమవుతోంది. మా అమ్మా నేనూ కూడా పదమూడేళ్ళకే పెద్దమనుషులమయ్యాం. ఆ కాస్త పనీ జరక్కుండా, మూడు ముళ్ళూ పడితే, విన్నవాళ్ళంతా ఎంత ఆనందిస్తారు? ఇంకా చిన్న కూచే అనుకుంటూంటే సరిపోయింది కాబోలు" అంది రమణమ్మ. ఝణఝణ లాడించేసింది.

"బావుందే— నీ చాదస్తం నీవూనూ! మా తల్లికి బి. ఏ., ప్యాసయ్యేదాకా పెళ్ళి చేయను" అన్నాడు పరిహాసంగా నవ్వుతూ.

"చాల్లెండి! మతిపోతే సరి, ఆడదానికి బి.ఏ.లు యం.ఏ లూనూ!... సంబంధం వెతికి తీసుకురండి. వైశాఖంలో పెళ్ళి చేసెయ్యొచ్చు!" అని రమణమ్మ నాజూకుగా కంఠం సవరించుకుంటూ చెప్పేసరికి, అతనికి మారుమాట తోచలేదు. వెర్రి వెంకన్న పంతులు హిందూ హృదయంలో ఒక్కసారిగా "అష్టవర్షే భవేత్కన్యా..." అన్న వాక్యం రింగురింగుమంది.

నాన్నకీ అమ్మకీ తన పెండ్లి విషయంలో వాదాలు జరుగుతుంటే వరహాలు చల్లగా జారుకుంది. తన గదిలోకి వెళ్ళి అల్లిక పని చూచుకుంటోంది.

## 2

భోజనాలకు కూర్చున్నారు. బొబ్బట్లు తింటున్నంత

సేపూ, వెంకన్న పంతు లెన్ని సార్లు పొగిడాడని! ఎన్ని తిన్నాడో అతనికే తెలియ లేదు. పెళ్ళీడుకున్న కుర్రాళ్ళ జాబితా చదువుతున్న రమణమ్మకీ తెలియలేదు. వరహాలికి తల్లి మీద ఎప్పుడూ యింత కోపం రాలేదు. వెంకన్న పంతులు ప్రతిదానికీ "ఊఁ! ఊఁ!" అంటూనే వున్నాడు. అతని మనస్సు ఆ విషయాన్ని అట్టే పట్టించుకుంటున్నట్టూ లేదు. 'అల్లుడు గాడిదల' నిరంకుశత్వము, పనికిరాని పెంకితనము అతని బుర్రలో బాగా పనిచేస్తున్నట్టున్నాయి,

చివరికి సందేహిస్తూనే ఇలా అన్నాడు: 'ఏమమ్మా వరాలూ! ఈ యేడు పెళ్ళి చేసుకుంటావా అమ్మా?' అని ముద్దుగా అడిగాడు. మాటవరసకే అడిగాడు. కాని వరాలు మాత్రం మూతి బుడాయించింది. తండ్రి ప్రశ్నకు జవాబు చెప్పలేదు. అంగీకార సూచనకూడా చేయలేదు. కేవలం మౌనం వహించి చెయికడుక్కోడాని కన్నట్టుగా చురుగ్గా లేచి వెళ్ళిపోయింది. వెళ్ళుతున్నప్పుడు అడుగులు కాస్త జోరుగా పడ్డాయి. బడిపంతులు గనుక కూతురుకు యిష్టంలేని ప్రసంగం తానెత్తేనని యిట్టే గ్రహించాడు.

అసలే నుగ్గునుగ్గుల తలేమో— తలంటి పోసుకుంటే మరీ బాగుంది. ముంగురులు ఉంగరాలుగా చుట్టబెట్టుకొని వేళ్ళాడుతున్నాయి. సాధారణంగా స్థూలంగా బొద్దుగా ఉన్న పిల్లలు మడ్డుగా వుంటారు. కాని వరహాలు విషయంలో

మాటుకు యీ విషయం సుతరామూ సరిపడదు. వరహాలు బలే చురుకుగా వుంటుంది. కనుకనే అందరికీ స్నేహితురాలైంది. బంగారంలాంటి శరీరచ్ఛాయకి ఎర్రరంగు పూలపరికిణీ, కాఫీ పొడుం రంగు వోణీ ఎంతో అందమిచ్చాయి. అందంలోనూ, అలంకరణలోనూ యెంత నేర్పరితనం లేకపోతే, వాళ్ళ పంతులమ్మగారు పన్నెండు రూపాయలు పెట్టి ఎంబ్రాయిడరీ ఫ్రేము, సూదులు, పూలుపిడులు, దారాలు, పుస్తకాలూ కొనిస్తుందీ వరహాలుకి! వరహాలు అసలు పేరు రత్నమాల. అయినా అంతా ముద్దుగా వరహాలని పిలవడమే అలవాటయిపోయింది.

ఎనిమిదేళ్ళనుంచీ ట్రాన్సఫర్ వగైరా వడిదుడుకులేమీ లేకపోవడం చేతనూ, వెంకన్న పంతులుగారి కుటుంబం చాలా మంచిదవడంచేతనూ, ఆవూళ్ళో వాళ్ళ జీవితం చీకూ చింతా లేకుండా సుఖంగానే గడచిపోతోంది. పైగా వరహాలు తెలివితేటలంటే అందరికీ అభిమానమే.

కొత్త కండువా పైట వేసుకోవడంచేత, మెడమీద చక్కిలిగింతలు కలుగుతున్నాయి వరహాలికి. అమ్మా, నాన్నా తన పెళ్ళిమాట ఎత్తినందుకు మొదట్లో కాస్త కోపంవచ్చినా క్రొత్త ఆలోచనలు పెదవులమీద బులిబులినవ్వుల తెలుపు పూస్తున్నాయి. ఎందుకో ఆమె మనస్సులో స్థిమితం కలగడం లేదు. యీ గదిలోంచి ఆ గదిలోకి, యిక్కడినుంచి అక్కడికీ ఒకటే పచార్లు చేస్తోంది.

వరహాల్ని దీవించడానికని పంతులమ్మగారు స్వయం గానే వచ్చింది. వస్తూనే వీధిలోంచి 'వరహాలూ' అని పిలిచింది. త్వరత్వరగా పరుగెట్టి "రండమ్మా" అంటూ ఆమె చెయ్యి పట్టుకొంది వరహాలు. లోపలికి తీసుకెళ్లి మంచంమీద కూర్చోబెట్టింది. త్వరగా కాఫీ, టిఫెను ఇమ్మని తల్లితో చెప్పి వచ్చింది.

"యిదుగోనమ్మా— నీకు ప్రెజెంటు తీసుకువచ్చాను. 'ఆంఖ్ కే కిర్కిరీ' అని దీనిపేరు. విశ్వకవి రవీంద్రుడిదమ్మా 'కంటిలోని నలక' అని చాలా బాగుంటుంది. దీని శైలి కూడా ఎంత చమత్కారంగా వుంటుందనుకున్నావు?" అంటూ చిరునవ్వు ముఖంతో చూస్తోంది సుశీలమ్మ.

సుశీలమ్మ మామూలు బి.యిడీ.యే కాదు, హిందీలో కూడా 'విశారద' ప్యాసయింది. కనుకనే హిందీలోగాని, తెలుగులోగాని, ఇంగ్లీషులోగాని— ఆమె ఎన్ని పుస్తకాలో చదివింది. స్వతహాగా తెలివైంది. కనకనే తన హెడ్‌మిస్ట్రెస్ పనిని అతి నైపుణ్యంగా నిర్వహించుకు వస్తోంది. ఆడపిల్లలందర్నీ కన్నబిడ్డల్లా చూచుకుంటుంది. అంచేతనే ఆ మిడిల్ స్కూలుకు మరో నూరుమంది బాలికలను సంపాదించింది. వచ్చి మూడేళ్ళే అయినా— స్కూలెంతో అభివృద్ధి అయిందని పెద్దవాళ్ళూ అనుకుంటూనే వుంటారు. తన ముద్దుశిష్యురాలికి

తనకున్న విద్యంతో ధారపోద్దామని సుశీలమ్మ ఉద్దేశ్యం. ఎన్నో బహుమతులిచ్చింది. ఎన్నో పుస్తకాలు చదివించిందామె. రవీంద్రుని యింగ్లీషు పుస్తకాలు చదివి బోధపరచేది. వరహాలుకి సుశీలమ్మ మీద గౌరవంకన్న ప్రేమే ఎక్కువ. వరహాలు రాష్ట్రభాష ప్యాసైందంటే దానికి కారణం సుశీలమ్మే.

# 3

తాను చదివిన నవలల్లోని నాయికలతో పోల్చుకునేది వరహాలు. నలుగురూ తన్ను మంచిదని పొగడ్తే వల్లనైతేనేం, సుశీలమ్మగారు 'చాలా గొప్పదాని వౌతావు వరహాలు' అంటూ యిచ్చిన రిమార్కుని, తల్చుకున్నప్పుడైతేనేం—కొంచెం తనలో తాను గర్విస్తూవుండేది. తనకి సోమేశ్వరరావు మీద వున్న అభిమానం నవలల్లోని నాయికా నాయకుల ప్రేమవంటిదా—కాదా! అని యిప్పటికీ సందేహమే! అయినా అలాంటి పెద్ద విషయాలకి అట్టే ప్రమేయం వుండే వయస్సు కాదు కనుక అట్టే యిబ్బంది కలుగలేదు.

వెంకన్న పంతులు ఆవూరు వచ్చిన మొదట్లో అతన్ని ఆదరించింది ఒక్క కరణం సుబ్బారావుగారే. వారింట్లో ఒక వాటా ఖాళీ చేసి పంతులికి బసయేర్పాటు చేశారు. యిల్లు పెద్దదైనా చాలాకాలం అద్దె తీసుకోనేలేదు. బాగుండదని—

తరువాత తరువాత నాలుగు రూపాయల చొప్పున వెంకన్న పంతులు యిస్తూనే వున్నాడు. క్లుప్తంగా గడుపుకుంటూ బడి వుద్యోగంలో మిగుల్చుకొంటూ రెండెకరాల భూమినికూడా సంపాదించుకొన్నాడు ఆవూళ్లోనే.

కరణంగారి యిద్దరి కొడుకులలోనూ సోమేశ్వరరావు యూనివర్సిటీలో చదువుకొంటున్నాడు. అతని తెలివితేటలు ఎక్కువో, అందమెక్కువో తేల్చి చెప్పటం కష్టమే! అలాంటి సోమేశ్వరరావు తన ఎర్రని గుండెల్లో చిన్న వరహాల్ని దాచుకున్నాడు. అతని హృదయపు గదిలో ఒక్క వరహాలు చిత్రమే వ్రేళ్ళాడుతోంది. అతను ఆనర్సు చదువుతున్నాడా, శలవుల్లో యింటికి వచ్చినపుడు వరహాలుతో చిన్నపిల్లవాడిలా ఆడుకునే వాడు. పచ్చీసుపాళి, వైకుంఠపాళీ, క్లీరెన్సు ... యిలాంటివే. అంతసేపూ వీటితోనే గడపలేక వరహాలికి చదరంగం కూడా నేర్పాడు సోమేశ్వరరావు. జ్ఞాపకంవస్తే వరహాలు గుండెల్లో జాజి పువ్వులు విరుస్తాయి. వొళ్ళంతా సన్నని జల్లు కురుస్తుంది కాని—వరహాలకి అతని మీదవున్న అభిమానం ప్రేమో-కాదో యింకా నిర్ధారణగా తెలియడంలేదు.

పంతులమ్మగారితో వాళ్ళింటి దాకా వెళ్ళి సాగనంపి చక్కావచ్చింది వరహాలు. యింటికివచ్చి పెరట్లో వాళ్ళమ్మతో ఏదో మాట్లాడుతోంది. వీధిలో పోస్టుమేను కేక పెట్టాడు.

'రత్నమాలగారట. వున్నారామ్మా.' తల్లితో పంతులమ్మగారి సంగతులు చెబుతోంది. తలవని తలంపుగా వినిపించిన పోష్టుమేను గొంతుక ఆమెను కంగారు పెట్టింది. 'ఎవరది...' అంటూ ఛంగున వీధిగుమ్మంలోకిచక్కావచ్చింది. కూడా రమణమ్మ అనుసరించింది.

పోష్టుమేను కాగితం తీసి యిచ్చాడు. "దీనిమీద ... యిక్కడ...సంతకం పెట్టండమ్మా" అన్నాడు.

"నేనే!!" ఆశ్చర్యపోయింది వరహాలు. అతని పెన్ను తీసుకొంది. కె. రత్నమాల. అని తెలుగులోనే సంతకం చేసింది రత్నాల్లాంటి అక్షరాల్ని మురిసిపోతూ చూస్తున్న పోస్టుమేను "వ్రాలు పెట్టండమ్మా" అన్నాడు. అతను ఒక పెద్ద పెట్టెతీసి యిచ్చాడు. చెప్పి వెళ్ళిపోయాడు.

"ఏమిటే...అదీ!" అంది రమణమ్మ. కళ్ళు మిలమిల మెరిపిస్తూ చూస్తోంది.

వరహాలు కంగారు పడుతోంది. గుండెలు కొట్టుకొంటున్నాయి. త్రాళ్ళు కత్తితో కోద్దామా అనుకుంది. 'అమ్మా! కత్తి తేవే' అంది.

కాగితాలూ, త్రాళ్ళూ తీసేసింది. చిన్న పేకేజీ పెట్టి పోస్టుమేను చేతిలో పెద్దదిగానే కనిపించింది. జాగర్తగా మూడ్డి

గించి, మూత తెరిచింది. కాగితముక్కలన్నీ తీసి విడిగా పారేసింది. ఆశ్చర్యపడింది. కళ్ళు రెపరెప లాడాయి. మిరుమిట్లు క్రమ్ముతుండగా దంతముపెట్టె పైకి తీసి, మూత తెరిచింది. మూతకు లోపలివైపున 'రత్నమాలకు—సోమేశ్వరరావు ప్రేమతో'... నల్లని అక్షరాలతో మెరిసే గులాబిరంగు కాగితం అంటించివుంది. ఆవాక్యాల్ని ఎన్నిసార్లో చదువుకుంది. రెండు పేర్లూ కలిపి మనసులో మననం చేసుకుంది. ఆశ్చర్యంగా చూస్తున్న తల్లితో "సోమేశ్వరరావు ప్రజంటు పంపేడే అమ్మా" అంది. దూరాల్లోకి చూపులు సారించింది.

రమణమ్మ కూతుర్ని గోముగా చూసింది. విలాసంగా నవ్వింది. హుందాగా లోపలికి వెళ్ళి పోయింది.

పెట్టెలోపల స్నో బుడ్డి, పౌడరు డబ్బా, తిలకం సీసా, గోళ్ళరంగు, లిప్‌స్టిక్కు వగయిరాలన్నీ అందమైన అరల్లో, ఒకరకమైన దంతపు భరిణల్లో వున్నాయి—ఒకటి రెండు ఖాళీ అరలు కూడా వున్నాయి. ఒక దాంట్లో సన్నగా మడచివున్న కాగితాల దొంతి కనిపించింది. తీసింది. గబగబా చూసింది. పెద్ద ఉత్తరం వ్రాసాడే అనుకొంది. ఉత్తరాన్ని పరికిణీలో దోపుకుంది. పెట్టె చేత్తో పట్టుకుని "చూడవే అమ్మా" అంటూ తల్లిదగ్గరకు వెళ్ళింది. చిరునవ్వును తళతళలాడిస్తూ కళ్ళలో కాంతులను చిందిస్తూ గదిలోకి వెళ్ళింది వరహాలు.

జాగ్రత్తగా ఉత్తరం చదవ నారంభించింది. ప్రతి అక్షరం దగ్గరా ఆగుతూ, మళ్లీ మళ్లీ సొంతంగా చదువుకుంటోంది. 'నా హృదయంలో ప్రతినిత్యం ఎన్నో హారతులు వెలిగించి, నీకే నీరాజన మిస్తున్నాను. నా గుండెలలో నీమీదవున్న ప్రేమకి యిది యొక సూచనకాదని నాకు తెలుసు. అయినా ఇంతకంటె దారిలేదు. గ్రహించి అనుగ్రహిస్తావు కదూ' అన్న పంక్తుల్ని మళ్ళీ మళ్ళీ చదివింది.

తన గుండెల్లో కాపురిస్తూన్న పసి వలపుల బంగారంతో ఆ అక్షరాలికి పూత పెట్టింది. కళ్ళకద్దుకుంది. ఎందుకలా చేసిందో తెలియలేదు. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎప్పుడూ యిలాంటి అనుభవాల్ని ఊహించనైనాలేదు. లేతగుండెకి సోమేశ్వరరావు ప్రేమ పులకరింపు కలిగించింది. కొత్త సిగ్గు మొగ్గను తొడిగింది.

తనకి అతనే భర్త అయితే...యెంత బావుంటుంది!

ఎక్కడినుంచీ, ఎప్పుడూ; తనకింత గౌరవము లభిస్తుం దనుకోలేదు. తనూ ఒక నాయిక అవుతున్నాను కదా అని గర్వించింది. సంతోషం పట్టలేకపోయింది. గిరగిరా తిరిగి పోయింది. అద్దంలో ముఖం చూసుకుంది. తన చెక్కిళ్ళను మృదువుగా నిముకుంది.

## 4

గబగబా కరణంగారింటిలోకి వెళ్ళింది. సీతమ్మగారితో మాట్లాడుతూ, యథాలాపంగా పడక గదిలోకి పోయింది. సీతమ్మగారికి పాపం! ఆడపిల్లలు లేరు. అంచేతనే వరహాలంటే ఎంతో చనువామెకి. గదిలో, గోడమీద సోమేశ్వరరావు తనవేపె చూసి నవ్వుతున్నాడు. సీతమ్మగారు బయటికి వెళ్ళారు. చుట్టూ చూసి కావిడిపెట్టె ఎక్కి సోమేశ్వరరావు పటం తీసింది వరహాలు. ఒక్కసారి తన గుండె కద్దుకుంది. చంపలు నీటితో తడిశాయి. పెదవులమీద చిరునవ్వులు సముద్రి కెరటాల్లా ఆడుకుంటున్నాయి. కనురెప్పలు చిలిపిగా అల్లల్లాడుతున్నాయి.

వంట చేసుకోడాన్కి అప్పుడే మడి కట్టుకుంటూన్నది సీతమ్మగారు. ఆమె దగ్గరకు వెడుతూ, మరచిపోయి, అత్తయ్యా! అని కేకేసింది. చప్పున నాలుక కరుచుకుంది వరహాలు. సీతమ్మగారు ఆ విషయాన్ని గుర్తించలేదు. "ఏమమ్మా!" అంది. "వెడతానండి!" అంది వరహాలు.

"అవునుగాని, యీవేళ నీ పుట్టినరోజుట కదమ్మా! నా తెలివి మండిపోనూ, నేను మరచేపోయానుస్మీ!!" అంది సీతమ్మగారు. దబ్బున మడి వదలి వచ్చింది. గదిలోకి వెళ్ళింది. సోమేశ్వరావు పటం ఇంకా అటూ యిటూ వూగుతూన్న సంగతి ఆమె కనిపెట్టనేలేదు! కావిడిపెట్టె తెరిచింది. అందులో

పెద్దాపురం శిల్కుచీర, రవికలగుడ్డలద్దు, బయటకు తీసింది. పసుపు బొట్టుపెట్టి, తాంబూలంతో వరహాలు చేతిలో పెట్టింది.

"నాకిప్పు డిదెందుకండీ...మీ..." ఏదో అనబోయి మానేసింది. దబ్బున వంగి సీతమ్మగారి కాళ్ళకి నమస్కారం చేసింది. సీతమ్మగారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఒక్కసారిగా వరహాల్ని లేవదీసుకొని కౌగలించుకుంది. 'నా బంగారుతల్లి' అంటూ నుదురున ముద్దుపెట్టుకుంది. "నా రెండో కోడలు అయితే ఎంత బావుండును" సీతమ్మగారు హృదయంలోని యీ మాటలు ఎంచేతనో బయటికే అనేసింది. మెరుపుతీగల్లా మెరుస్తున్న వరహాలు కళ్ళు చూస్తూంటే, ఆమెకలా అనాలని పించింది కాబోలు!

వరహాలు యింటికి వెళ్ళింది. తల్లికి చీర చూపించింది. పెట్లో దాచుకుంది. పంతులమ్మగారింటికి వెళ్ళింది.

వాళ్ళమ్మగారు వంట వండుతూంటే, దగ్గర కూర్చుని సుశీలమ్మ అల్లుకుంటూంది. వాకిట్లోంచి "సుశీలమ్మగారూ!" అని సన్నగా పిలుస్తున్న కేక వినిపించి, లేచిందామె. "యింత ట్లోకే మళ్ళీ వచ్చేవేమమ్మా!" అన్నది ఆశ్చర్యంగా. ఆనం దంగా వరహాలు జబ్బమీద చెయ్యివేసి, తన గదిలోనికి తీస్కు వెళ్లింది. యిద్దరూ మంచంమీద కూచ్చున్నారు. "ఇందాకా ఇంటికి వెళ్ళానా..." చిరునవ్వుతో ప్రారంభించింది వరహాలు.

సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప.
ప్రవేశసంఖ్య.......................
తేది.......................

జరిగిన కథంతా పూస గుచ్చినట్లు చెప్పింది. దాచి తెచ్చిన ఉత్తరం తీసి, సిగ్గుపడుతూనే ఆమె చేతికిచ్చింది. నవ్వు ముఖంతో ఉత్తరంపూర్తి చేసింది సుశీలమ్మ. ఆనందభాష్పాల్ని దిగమింగుకుంది. "ఏమిటమ్మా!...అబ్బో!! చెప్పవేకావే... కరణంగారి రెండో అబ్బాయి కదూ! ఎంత మంచివాడు."

వరహాలు ఆమె కళ్ళలోకి చూసింది. చప్పున ముఖం వంచుకుంది.

"ఏంచెయ్యమన్నారు!" అంది. అనుకోకుండానే ఆగింది.

"ఏం చేయడం ఏమిటమ్మా! అందినట్లు ఉత్తరం రాయి...పెళ్ళి చేసుకుని..." బుగ్గమీద చిటికె వేసింది. యిద్దరూ కిలకిలా నవ్వుకున్నారు. వేయివీణలు ఒక్కసారి మోగియించినట్లయింది.

"నాకు చాలా ఆనందంగా వుందమ్మా" అంది నవ్వావు కుంటూ సుశీల.

అసలే పిల్లలదగ్గర తన గొప్ప ప్రదర్శించే గుణం లేదామెకి. వరహాలంటే మరీ ప్రాణం. తనకు ఎంతో ఆప్తురాలు గానే చూసుకుంటుంది. కనుకనే ఒకటి రెండు సార్లు "నన్ను మన్నించకమ్మా. అక్కా! అంటే చాలదూ!' అని గట్టిగానే చెప్పింది. కాని వరహాలు మానలేదు.

"ఆయన పంపిన పెట్టె రేపు చూపిస్తానండీ" అంది. నమస్కరించింది. యింటికి వచ్చేసింది వరహాలు.

# 5

"ఏం మహానుభావా! కుమార్తె పుట్టినరోజుకు మమ్మల్నెవర్నీ పిలవనే లేదేమయ్యా- భోజనాలికి?" అన్నారు కరణం సుబ్బారావుగారు, మర్నాడు వెంకన్నపంతులు వీధిలో అరుగుమీద పళ్ళుతోముకుంటూండగా!

"చాల్లెండి..విన్నవాళ్లెవరైనా నవ్విపోతారు. పంతులుగార్ని ఏమంత ఘనులని భోజనానికి పిలవాలేం!!... చేసిన తప్పుకు లెంపలు వాయించుకుని...నష్టపరిహారం దాఖలు చేసుకోండి మా అన్నగార్కి" అంది నవ్వుతూ సీతమ్మగారు. కరివేపాకు రెబ్బలు చేత్తోపట్టుకొని లోనికి వెళ్ళిపోయింది. కరణం సుబ్బారావుగారు భార్య ఎత్తిపొడుపుకు ముఖంఅదోలా మార్చారు. గుర్తుచేసుకున్నాడల్లే వుంది!

"ఏమోయి వేంకన్నపంతులూ! సోమేశ్వరాన్ని-వరహాలికిద్దామని మా ఉభయులం సంకల్పించాం" అన్నాడు సుబ్బారావుగారు. ఆమాట వినేసరికి సీతమ్మ కళ్ళల్లో ఆశ మిలమిల లాడింది.

వెంకన్న పంతులు చేతిలోపుల్ల ఒక్కసారిగా జారి పడిపోయింది. చివరికి సర్దుకుని "తథాస్తు" అన్నాడతను.

ఆవేళ సాయంత్రం— పంతులమ్మగారు వరహాల్ని చక్కిలిగింతలు ప్రారంభించారు.

బహుశా రెండురోజుల తరవాత యూనివర్శిటీలోని సోమేశ్వరరావుకి కూడా చక్కిలిగింతలు అందేవుంటాయి.

"ఏమయితేనేం? మన వరహాలు ధన్యురాలు సుమా!" అన్నాడు వెంకన్నపంతులు.. భార్యను దగ్గరగాలాక్కుంటూ.. ఆవేళ రాత్రి ఒంటిగంటకి...!

⁂

రచన — 1945 లో.

ఆకాశవాణి విజయవాడ కేంద్రంనుంచి ప్రసారం 1950లో.

ప్రచురణ — ఆంధ్ర సచిత్ర వారపత్రిక 8-1-1958 సంచికలో.